

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**చాలామందికి** స్పెషల్ రోజుల డేట్స్ గుర్తుపెట్టుకోవడం ముఖ్యం. అవి మర్చిపోతే గొడవలు జరగడం సహజం. కాని మా కుటుంబంలో అలాంటి ఇబ్బందులు లేవు. మా అమ్మ, నాన్న పెళ్ళి తారీకు నేను తెలుసుకుంది ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు. మా ఇంట్లో వారి పుట్టినరోజు తేదీలు అందరికీ తెలిసినా అది ఈరోజే అనే సంగతి మాకు తట్టదు. ఎవరికి గుర్తొచ్చినా "ఇవాళ్ళ తన బర్త్‌డే విష్ చెయ్యి" అని పంచుకుంటాం. ఎవరికీ గుర్తులేని సమయంలో మా అమ్మ నుండి ఫోన్ వస్తుంది. ఉద్యోగరీత్యా రోజూ క్యాలెండర్‌ని చూసే మాకే గుర్తులేకపోతే నిత్యం పనిలో మునిగిపోయే మా నాన్నకి గుర్తుండకపోవడంలో ఆశ్చర్యంలేదు. కానీ "వచ్చే నెల కావ్య పుట్టిన రోజు కదా, ఇది తీస్కుందామా?"... "అమ్మ బర్త్‌డేకి ఇదివ్వమ్మా", "ఊహ పుట్టినరోజుకి నువ్వు కేక్‌ని తయారు చెయ్యి" అని మా నాన్న నాతో అన్నారు. ఓసారి కావ్య పుట్టినరోజుకి తను కూడా కేక్ కట్ చేస్తా అని ఊహ ఏడవడంతో మా నాన్న ఇంటికొచ్చిన అతిథులని ఆగమని ఊహకోసం కేక్‌ని కొని తెచ్చారట. అప్పటి నుండి ప్రతీ సంవత్సరం కావ్య ఊహలో ఏవరి పుట్టినరోజైనా రెండు కేకులని తీసుకురావడం ప్రారంభించారు. ప్రతి పుట్టినరోజుకి తలస్నానం చేసి కొత్తబట్టలు వేసుకోవడం మా అమ్మ నేర్పిన ఆచారం. "పోనీ కనీసం కొత్త షర్ట్ అయినా వేసుకో" "ఆఫీసు నుండి వెళ్తూ ఓ డ్రెస్ కొనుక్కో" అని పనిలోపడి షాపింగ్ మర్చిపోయిన కావ్య, ఊహతో మా అమ్మ ప్రతీ సంవత్సరం అనే మాటలవి.

నాకు బాగా గుర్తుండిపోయిన, ఇప్పటికే ఫేవరెట్ డ్రెస్ ఓ పుట్టినరోజుకి మా నాన్న సింగపూర్ నుంచి తెచ్చిన ఎరుపు, ఆరెంజ్, పింక్ రంగులు కలిసి, చర్మానికి గుచ్చుకోకుండా పీచులు వేలాడే "తమాషా డ్రెస్" (చిన్నప్పుడు నా బట్టలకి కూడా పేర్లుండేవి) ఆ రోజు మా నాన్న నన్ను, నా ఫ్రెండ్స్ కాశ్యప్, సమ్మీలని త్రీ మంకీస్‌లా కిటికీలో కూర్చోమని తీసిన ఫోటో ఈ రోజుకీ మాకు చాలా ఇష్టం.

వయసుకి తగ్గట్టు ఆసక్తికరమైన గిఫ్టులను ఇవ్వడం మా నాన్న ప్రత్యేకత. నేను డిటెక్టివ్ అవ్వాలనుకున్న సమయంలో నా పుట్టినరోజుకి మా నాన్న ఇచ్చిన స్పైకి సంబంధించిన గ్రీటింగ్ కార్డ్ ఇప్పటికీ నా దగ్గర భద్రంగా ఉంది. అలాగే నేను డైరెక్టర్ అవ్వాలనుకున్న సమయంలో మా నాన్న ఎల్.ఏలో కొన్న పుస్తకాలను ఇచ్చి ప్రోత్సహించారు. మా అమ్మా, నాన్న అమెరికా వెళ్ళొచ్చిన

ప్రతిసారీ నా గిఫ్ట్కి ఓ పెట్టెని కేటాయించేవారు. నాకు బాగా గుర్తుండిపోయిన బహుమతిని పగలకుండా, నేను తెరిచి చూసేందుకు అట్టపెట్టెను తీయకుండా ఎంతో కష్టపడి ఓ సూట్‌కేస్‌లో పెట్టి తీసుకురావడానికి మా నాన్న తన పుస్తకాలని అక్కడే వదిలేసారు. (మా నాన్న పుస్తకాలని వదిలిపెట్టడం ఎంత కష్టమో మా కుటుంబ సభ్యులకి మాత్రమే తెలుసు) నేను ఎప్పటికీ మర్చిపోలేని ఆ గిఫ్టని కొనడానికి వెళ్ళినప్పుడు గెయిన్స్‌విల్లో ఏరోస్పేస్ చదువుతున్న కావ్య ఫ్రెండ్ ప్రణీత్‌ని కూడా తీసుకుని వెళ్ళి ఎన్నో షాపులు తిరిగి 2009లో ఉన్న బెస్ట్ టెలిస్కోప్‌ని నా కోసం కొన్నారనే విషయాన్ని మా అమ్మ సీక్రెట్‌గా ఉంచలేకపోయింది.

అలా గుర్తుండిపోయిన మరో గిఫ్ట్ ఇచ్చింది మా అమ్మ. నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు ఓ ఉదయాన మా అమ్మ నన్ను నిద్రలేపి "పండు, నీ డ్రీమ్ ఏంటి?" అని అడిగింది.

"సైంటిస్ట్ అవ్వడం" అని చెప్పాను.

"నీకోసం ఓ గిఫ్ట్ తెచ్చాను" అని చెప్పగానే కళ్ళు పెద్దవి చేసి "ఏం గిఫ్ట్?" అని అడిగాను. "నువ్వే వచ్చి చూడు" అని మా అమ్మ నాగదిలోంచి బయిటకి నడిచింది. గబుక్కున పరుగెత్తి హాల్లోకి వెళ్ళి చూడగానే డైనింగ్ టేబుల్ మీద ఓ చెక్కపెట్టె కనబడింది. "ఏంటది?" అని ఆశ్చర్యపోతూ అడిగాను. "నువ్వే తెరిచిచూడు" అని మా అమ్మ బదులిచ్చింది. నోరు పెద్దగా తెరిచి ఆ పెట్టెలోని మైక్రోస్కోప్‌ని చూసి ఇల్లంతా నేను జింకలా ఎగరడం నిన్నే జరిగినట్లుగా గుర్తుంది. సైన్స్‌లో చదువుకున్న ఉల్లిపాయ పైన రెమ్మనుండి నేను తాగే నీటి వరకు ప్రతీది మైక్రోస్కోప్‌లో చూసి ఒక బుక్‌లో నోట్ చేసుకునేదాన్ని. ఓసారి మా అమ్మ వెజిటబుల్స్ కట్ చేస్తుండగా వేలు తెగింది. నేను వెంటనే "అమ్మా! ఆగు. కదలకు. నేను ఇప్పుడే వస్తాను" అని నా గదిలోకి వెళ్ళాను. ఆయింట్‌మెంటో, బేండేజో తెస్తా అనుకున్న మా అమ్మ నా చేతిలో మైక్రోస్కోప్ స్లైడ్‌ని చూసి నిరుత్సాహపడింది. ఆ విధంగా మా అమ్మా, నాన్న ఇచ్చిన ప్రోత్సాహంతోనే నేను ఈ రోజు రిసర్చర్ అయ్యి నాసా సైంటిస్ట్‌లతో కలిసి పనిచేయగలిగాను.

ఆరేళ్ళకి డిటెక్టివ్, ఏడేళ్ళకి ఫిల్మ్ మేకర్, ఎనిమిదేళ్ళకి సైంటిస్ట్ అంటే ముద్దుగానే ఉంటుంది. కానీ నేను పదిహేడేళ్ళకి "సన్యాసం తీసుకోవాలనుకుంటున్నాను" అని చెప్పాను. (పోయిన సంవత్సరం వరకు అదే గోల) మొదట్లో జోక్ చేస్తున్నాను అనుకున్నా నేను ఆ విషయాన్ని వదిలి పెట్టకపోవడంతో "సన్యాసం అంటే హిమాలయాల్లో కూర్చుని తపస్సు చెయ్యడంకాదు. అది చాలా కష్టం. నీకు అర్హతలేదు" అని మా అమ్మ చెప్పింది. ఆ రోజునుండి దాదాపు నాలుగు నెలలు నేను నేలమీద పడుకుని, చన్నీటితో స్నానం చేసి, కేవలం ఆధ్యాత్మిక పుస్తకాలు చదివి, భక్తిగీతాలు వినడంలాంటి పనులు చేసాను. కాలేజీలోనా నా ఫ్రెండ్స్‌కి కూడా నా చేష్టలు కోపాన్ని తెప్పించాయి.

ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతుండగా ఓ ప్రొఫెసర్ నన్ను క్లాస్‌లో లేపి "వాట్ డూ యూ వాంట్ టు డూ ఆఫ్టర్ ఇంజనీరింగ్?" అని అడిగారు. నేను "ఐ వాంట్ టు బికం ఏ నన్" అని బదులివ్వగా ఆ ప్రొఫెసర్‌కి ఏమనాలో తోచక లెక్చర్ కంటిన్యూ చేసారు. ఓ ఆదివారం రోజు నా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళినప్పుడు వాళ్ళ డాడీ నన్ను "పెళ్ళి ఎప్పుడు చేసుకోవాలనుకుంటున్నావమ్మా?" అని అడిగారు.

"పెళ్ళికాదు, నేను సన్యాసం తీసుకోవాలనుకుంటున్నాను" అని ఇచ్చిన జవాబుని నా ఫ్రెండ్ వాళ్ళ నాన్న ఈ రోజుకీ మర్చిపోలేదు. ఈ సంవత్సరం మేలో మాట్లాడుతూ "లిపిని చూసి ఇన్‌స్పైర్ అయ్యి సన్యాసం తీసుకోవాలనుకోకు" అని నా ఫ్రెండ్‌కి చెప్పారట.

ఆఖరికి మా అమ్మ నా బాధ భరించలేక "హిందూ సాంప్రదాయం ప్రకారం సన్యాసవ్వాలంటే అమ్మా, నాన్నల పర్మిషన్ ఉండాలి. నేను ఎట్టి పరిస్థితుల్లో నీకు పర్మిషన్ ఇవ్వను" అని చెప్పింది. ఆ రోజు నేను ఏడ్చిన ఏడుపు చూసిన ప్రతి ఒక్కరూ భయపడ్డారు. కానీ చాలా ప్రాక్టికల్‌గా ఉండే మా నాన్న ఆ అంశంపై ఏడేళ్ళు రిసర్చ్ చేసి, హిమాలయాలనుండి కాశీవరకు తిరిగి, అనేక పుస్తకాలు చదివి,

ఎంతోమంది సాధువులు, సన్యాసులను కలిసి క్లుప్తంగా నా ప్రశ్నలకు సమాధానాలను 'ప్రయాణం' అనే పుస్తకం రాసారు. అంతకన్నా విలువైన గిఫ్ట్ ఈ భూమండలంలో ఎక్కడా దొరకదు. (ఇటువంటి బంధాలవల్లే నాకు అర్హతలేదు కాబోలు.)

"గిఫ్ట్ ఇస్తే అది ఉపయోగపడాలి. చూసి పక్కన పడేసేటట్టు ఉండకూడదు" అని మా నాన్న నాకు నేర్పిన పాలసీనే నేను పాటిస్తున్నాను. పుస్తకాలు చదివే అలవాటున్న వారికి మా నాన్న బుక్స్‌ని గిఫ్ట్‌గా ఇస్తుంటారు. వాటిలో నాకు గుర్తున్నది దేవదాస్ కనకాల ప్రొఫెసర్‌గా పనిచేయడం మొదలుపెట్టినప్పుడు ఆయనకి ఉపయోగపడే ఏక్టింగ్‌కి సంబంధించిన పుస్తకాలను కానుకగా ఇచ్చారు. అలా బుక్స్‌ని ప్రెజెంట్ చేసే మరో వ్యక్తి చలసాని ప్రసాద్‌రావుగారు. ఓ పుట్టినరోజుకి నాకు 'గ్రిమ్స్ ఫెయిరీ టేల్స్' బుక్‌ని ఇచ్చారు. చిన్నతనం నుండి చదివిన ప్రమేయమో, లేక ఆ కథల్లో ఉన్న మాయో తెలీదు కానీ ఈ రోజుకి నేను ఫెయిరీ టేల్స్‌ని చదువుతుంటాను. ఆయన మరోసారి ఇచ్చిన ఓ ఆస్ట్రానమీ పుస్తకంలో నెబ్యులా గురించి చదివినప్పటినుండి నాకు కాస్మాలజీపై ఆసక్తి పెరిగింది. ఆ విధంగా నా జీవితంలో ఉన్న ముఖ్యమైన విషయాలపై పుస్తకాల ప్రభావం ఉంది.

మా నాన్నలా ఏ గిఫ్ట్ ఇచ్చినా మెమరబుల్‌గా ఉండాలి అని భావించే కావ్య చిన్నప్పుడు ఊహకి ఇచ్చిన గిఫ్ట్‌ని మేము ఎప్పటికీ మరవలేము. "గో టు కిచెన్" అని రాసున్న కాగితాన్ని ఉదయాన్నే ఊహకి ఇచ్చింది. ఒక ఖాళీ ట్రేని నాకు ఇచ్చి వాళ్ళ వెంట రమ్మంది. కిచెన్‌లో ఓ గిఫ్ట్‌తో పాటు "లుక్ ఇన్ ద ఫ్రిడ్జ్' అన్న కాగితం ఉన్నాయి. ఆ రెండిటినీ ట్రేలో పెట్టి ఫ్రిడ్జ్‌లో చూసాం. అలా ఇల్లంతా తిరిగాక ఆఖరి కాగితంలో "గోటూ బాల్కనీ" అని ఉండడంతో బాల్కనీలోకి వెళ్ళాం. గిఫ్ట్‌రాప్‌లో ఉన్న డబ్బాని చూసి ఊహ తెరిచే ప్రయత్నం చేసింది. ఎంత విప్పిన గిఫ్ట్ రాకపోవడంతో ఊహ ఆసక్తి పెరిగింది. చివరికి తెరిచి చూస్తే అది - అగ్గిపెట్టెలో ఓ రూపాయి బిళ్ళ. ఆ రోజునుండి 'గో దేర్.. గోదేర్' గిఫ్ట్స్ మా సాంప్రదాయంగా మారింది. అలాగే మరోసారి ఊహ పుట్టిన రోజుకి ఆఖరి నిమిషం వరకు గిఫ్ట్ కొనడం మర్చిపోయిన కావ్య రంగురంగుల కాగితంలో ఉన్న ఓ పెద్ద డబ్బాని ఇచ్చింది. ఎంతో కుతూహలంతో ఊహ ఆ డబ్బాని తెరిచింది. అంతే కుతూహలంతో ఆ డబ్బాలోని చిత్తుకాగితాలను పదినిమిషాలపాటు తీసి "అసలు ఇందులో ఏమైనా ఉందా?" అని కావ్యని అడిగింది. "నీ కోసం ఓ గిఫ్ట్ పెట్టాను వెతుకు" అని కావ్య బదులిచ్చింది. మరో పదిహేను నిమిషాలపాటు చిత్తుకాగితాలను బయటికి తీసాక అందులో ఓ చిన్న చాక్లెట్ దొరికింది.

ఈ సంగతి తెలిసిన మా నాన్న లాస్ట్ ఇయర్ ఊహ పుట్టినరోజుకి ఓ డబ్బా నిండా చిత్తుకాగితాలను నింపి అందులో ఓ డాలర్, ఓ పెన్నీ, ఓ నికెల్, ఓ డైమ్, ఓ చాక్లెట్‌ని పెట్టి ఇచ్చారు.

ఇల్లంతా మాతో తిరిగే సమయంలేకపోవడంతో మా అమ్మా, నాన్న మా నవ్వులు విని ఆనందించేవారు.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story